# ★ క్షణంలో సగం ★

'శారద'

'కాలికూడా పదార్థమే నంటున్నారు సైంటిస్టులు' అన్నాడు వేదాంతరావు. జోగ్గ కార్తాలో స్వాతంత్ర్యం అరుస్తోంది. ప్రపంచ నాయకులు విమానాల్లో పరిగెడుతున్నారు...

నేను ఇంకొకణ్ణి అయిపోతే బావుణ్ణని ఎన్నో సార్లు అనుకుంటూ కుర్చీనుండి లేచాను. పత్రిక వార్తలు వినిపించటం మానేసింది. అచ్చు గడిబిడి అయి కంపోజిటర్ల దుంప తెంపుతోంది. ప్రూఫులు సరాసరి ఎడిటర్లదగ్గరకే పోతున్నాయి. 'శేఖరం'ని 'ఖరం' అని దిద్ది అందర్నీ నవ్విస్తున్నాడు ఎడిటర్. ఏం రాసినా చలామణీ అయ్యే రచయితలు మెరీనాలో కూర్చొని కాలక్షేపానికి మైనపు వత్తులు తింటున్నారు. ఊరక దంపుడు కమిటీ, ఊరకని ఆహార కొరతలో ఉపయోగించే శతవర్ష ప్రణాళికని ప్రకటించి ఆఫీసుకు పంపింది. దానికి ఆకర్షణీయమైన శీర్షికలు పెట్టమని ఎడిటర్ ఇచ్చిన ఆజ్ఞ జేబులో బరువుగా మోగుతోంది.

వర్షపుజల్లు పడి రోడ్డంతా జారుతోంది. ఎన్నడూ వేగంగా పోని ట్రాం అందుకనే గబగబ పరిగెడుతోంది గావును. రోడ్లు కిటకిటలాడుతున్నాయి. ఆడవాళ్ళు ఒక షాపు ముందు గుంపులు కూడారు. తొంగి చూశాను. నా వెనకనించి ఆడవాళ్ళు ఎగిరిఎగిరి షాపులోకి విరుచుకు పడ్తున్నారు. సీసాల్లో వెన్నెల పౌన్ల లెక్కన అమ్ముతున్నారు. కాంతిని సీసాల్లోపోసి ప్రేమ కలిపినవి, కలపనివి అని అమ్ముతున్నారు.

జాతీయ వెన్నెల్నీ, బ్రిటిష్ ప్రేమనీ పారిస్ ఎండనీ తాహతునుబట్టి కొనుక్కుపోతున్నాయి, సిల్కు చీరలు, టిష్యూ రవికలూ. వేదాంతరావు ఐదు పౌచుల ఆనందం కొని చొక్కా కింద దాచి పట్టుకుపోతున్నాడు. ఏమిటండీ అని అడిగాను. 'భావంకూడా పదార్థమేగా' అంటూ తొందరగా వెనక్కి పోతున్నాడు.

మార్వాడీ షాపు రేషన్ ప్రకారం ఆహార ప్రణాళిక కొనుక్కుని ఇంటికి వెళ్తున్నాను. దారిలో ఓ హోటల్లో విదేశాలనించి రాబోయే రుచికరమైన గోధుమ రొట్టెలు ఘుమఘుమలాడుతున్నాయి. రెండు ప్లేట్లు తెమ్మన్నాను. చుట్టూ కూర్చున్న మనుషులు. ఎక్స్‌ప్రెస్ వార్తలు పడ్డ న్యూస్‌ప్రింటు ముక్కల్ని పచ్చిమిరపకాయ కొరుక్కుంటో తింటున్నారు.

ఆకలికూడా పదార్థమేనని వేదాంతరావు బి.బి.సీ నుండి ఢిల్లీ రిలే చేస్తున్న ఉపన్యాసంలో ఉద్ఘోషిస్తున్నాడు. ఇంట్లో భార్య రిపేర్‌లో వుంది. పెన్సిలిన్ రిపేర్‌కి డాలర్ ఋణంకోసం ఎడిటర్‌కి వ్రాశాను. ఇంటికిపోతూ డాక్టర్ని అడిగితే పెన్సిలిన్ డాలర్ పెట్టి కొనే సరకు గనక నాటుమందు వాడే పద్ధతిమీద వ్యాసం రాసి యిచ్చాడు. దానికి పనికొచ్చే విషయాల్ని పజిల్ గా ప్రకటించి బి. ఏ., బి. ఎస్. సి.ల సరదా తీరుస్తున్నాడు ఇల్లస్ట్రేటెడ్ ఎడిటర్. ఆహార సమస్య పజిల్‌లో ముఖ్య మంత్రి, ఆహార మంత్రి ఎగ్రాస్‌కి డౌన్‌లో తగాదాగా వుంది. బహుశా వొచ్చేవారం తేలకపోవచ్చు. డిక్షనరీలు తిరగబడుతున్నాయి. కాఫీలు అయిపోతున్నాయి. సిగరెట్లు కాలిపోతున్నాయి పట్టాలు లేకపోవడం వల్ల విమాన ప్రమాదాల మంత్రి అవసరంతగ్గింది.

వివాదాల పరిష్కారం కోసం వేసిన కమిటీ వాళ్ళు వివాదాలతో పోలీసుల్ని అర్థించారన్న వార్త అబద్ధమన్న సవరణ పత్రికల్లో మొదటి పేజీలో వేశారు. ఆహార కొరత ప్రాంతాలకి విరివిగా సప్లయి అవుతున్నాయి, పత్రికలూ, ఉపన్యాసాల రికార్డులు, రేడియో సెట్లు, వ్యవసాయంలో కొత్త పద్ధతులూ.

భూముల్లేని వాళ్ళకి ఆకాశం దున్నే పద్ధతుల మీద వ్యవసాయ శాఖ డిప్లొమా లివ్వకలదు.

ఇంట్లో అడుగుపెట్టే, ఇల్లు వెనక్కి జరుగుతోంది. వెనక్కి నడచి ఇంట్లోకి పోయాను. భార్య న్యూస్‌ప్రింటు వొండి, సిరా కలిపి వొడ్డించింది. బహుశా సాహిత్యం అధికోత్పత్తి మార్గం ఇదికావచ్చని మా ఎడిటర్ ఈమార్గం కనిపెట్టాడు.